# పెళ్ళాడే బొమ్మా! భ్రమలోపడ్డావా!

"రక్షించండి - రక్షించండి"

ఆ వెంటనే తలుపులు దబదబ బాదుతున్న చప్పుడు.

రాత్రి పదకొండుగంటలవేళ. విశ్వేశ్వర్రావు వీధిలో ఇంచుమించుగా అన్ని ఇళ్ళల్లో బెడ్ లైట్లు మాత్రమే వెలుగుతున్నాయి. కాని పదిహేనో నెంబరు ఇంట్లో మేడమీద పరీక్షలకు చదువుతున్న రాఘవగదిలో మాత్రం పెద్దలైటు వెలుగుతోంది.

ఆ అరుపులకు అతడు దిగ్గునలేచి కిటికీలోనుంచి తొంగిచూశాడు. రెండిళ్ళ అవతల ఒక యింట్లోనుంచి పొగ వస్తోంది. అది పెంకుటిల్లు.

రాఘవగదికి మెట్లు బయటినుంచే ఉన్నాయి. గదికి తాళంవేసి గబగబా మెట్లు దిగాడు.

వీధి నిర్మానుష్యంగా ఉంది.

పరుగెత్తినట్టుగానడిచి పొగ ఏమూలనుంచి వస్తున్నదో టార్చివేసిచూశాడు. ఇల్లు రోడ్డుమీదికే ఉంది. ఇంటివెనకగా ఒక గదిలోనుంచి పొగ గుప్పగుప్పున పైకి లేస్తున్నది. పొగమధ్య మంటలు కనబడుతున్నాయి. ఆ గదికీ ఇంటికీ మధ్య రెండుగజాల స్థలం ఉంది. ఆ సందులోనుంచి వెళ్ళి టార్చిదీపపు వెలుగులో ఆ గదివంక చూశాడు.

గది బైట గొళ్ళెంపెట్టి ఉంది.

లోపలినుంచి ఆర్తనాదం వినబడుతోంది.

అమ్మా అన్న కేకలు.

అప్పుడనిపించింది రాఘవకు ఎవరైనా నలుగురు తోడుగా ఉంటే బాగుండునని. కాని ఆలోచించే వ్యవధి లేదు. తలుపు గొళ్ళెంతీసి తలుపు నెట్టాడు.

లోపల గాడాంధకారంగా ఉంది. పొగతో నిండిపోయిందాగది. మంటలు పైకి లేస్తున్నాయి.

రాఘవ టార్చివెలుగులో గదిలో అడుగుపెట్టబోయాడు. పొగ గొంతులోకి పోయి దగ్గువచ్చింది. ఆ వెలుగులో తలవెంట్రుకలు విరియబోసుకున్న యువతి అతడిని దాటుకుంటూ బైటికి వచ్చింది మూలుగుతూ.

ఆమె ముఖంనిండా బొబ్బలు వచ్చినట్లున్నాయి. చీరె ఇంచుమించుగా అంతా కాలింది. కాళ్ళకు, చేతులకూ నల్లటి బొబ్బలు తేలాయి. తలవెంట్రుకలు చాలావరకూ కాలాయి.

''అయ్యో, మీరెవరో సమయానికి తలుపు గొళ్లెంతీసి నన్ను కాపాడారు. నేను అలిసిపోయి వచ్చి పక్కమీద వాలాను. ఎప్పుడో నిద్రపట్టింది. ఒక్కసారి పక్కలోనుంచి పొగ- దానివెంట సన్నటి మంట గదంతా చుట్టేసింది ఒళ్ళంతా మంటలు పొగ గొంతులోకి పోయి ఉక్కిరిబిక్కిరి చేశాయి. తలుపు తీద్దామని లాగితే రాలేదు. మంటలు ఎట్లావచ్చాయో ఎక్కడినుంచి వచ్చాయో అర్థంకావటం లేదు.''

"తలుపు బయట గొళ్ళెంఉంది. ఇంత రాత్రివేళ కేకలువినబడి వచ్చాను" అంటూ తను కప్పుకున్న శాలువలాంటిది ఆమెచుట్టూ కప్పి "మీరు ఇంటిముందరి వరకూ నడవగలరా?"

ఆమె తన కాళ్ళు చూసుకుంటూ తన చీరెలోనుంచి కొంత భాగం చింపి కాళ్ళకు చుట్టుకుని "ఇంక మెల్లగా నడుస్తాలెండి" అంటూ అడుగులు వేయటం మొదలు పెట్టింది

అతడు తన సైకిల్ తెచ్చుకుని రోడ్డు చివరివరకూ వెళ్ళి ఒకరిక్షా తీసు కొచ్చాడు.

"హాస్పిటల్ కా?" అడిగిందామె.

"కాదు, పోలీసుస్టేషన్‌కి. వాళ్ళద్వారా హాస్పిటల్‌కి వెళ్ళాలి.

పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళగానే డ్యూటీలో ఉన్న యస్సై చేతికర్ర ఆడించు కుంటూ ఎదురుగా వచ్చాడు.

అతడు యస్సైకి నమస్కారం చేసి జరిగినదంతా చెప్పాడు ఆమెను చూపిస్తూ.

"నీవెవరో గాని మంచికథ అల్లి చెప్పావు. భార్య కాలిపోయినప్పుడు ప్రతి భర్తా తాను అమాయకుడనని చెప్తాడు."

''ఏమమ్మా? ఈయన మీ ఆయన కాడా? నిజం చెప్పు?"

"కాదండి. ఈయనెవరో నాకు తెలియదండి నిద్రపోతున్న నేను ఒంటికి సెగతగిలి లేచానండి. తలుపు తెరుచుకుని బైటికి రావాలంటే ఎవరో బయట గొళ్లెం పెట్టారండి. నా కేకలకు ఈయన ఎవరోగాని తలుపు తెరిచారండి. నేను బైటికి రాగానే ఈ శాలువ కప్పుకోమని ఇచ్చి రిక్షాలో మీ దగ్గరికి తీసుకువచ్చిన దేవుడండి."

"ఇదంతా నన్ను నమ్మమంటావా? ఒళ్ళు కాల్చినా భర్త కాల్చాడని ఏ భార్య చెప్పదు. నిజంగా ఈయన మీ ఆయన కాడంటావు అంతేనా?" కర్ర తిప్పుతూ అన్నాడు.

''మా ఆయన కాదండి. రెండు నెలల క్రిందట మా ఆయనకు ఏలూరు ట్రాన్స్ఫరయింది. నేను స్కూలు టీచర్ని వేసవి సెలవుల్లో నాకు బదిలీ చేస్తామన్నారండి నా దరఖాస్తు చూసి."

''ఈ అమ్మాయిని హాస్పిటల్‌లో జాయిన్‌చేసివస్తా. నీవు నిజం చెప్పే వరకు ఈ కర్ర నీ ఒంటిమీద ఆడుతుంది జాగ్రత్త. నాలుగువందల మూడూ. ఇతడిని లాకప్‌లో పెట్టు నిజం చెప్పించే ప్రయత్నం చెయ్యి'' ఆమెను జీపులో ఎక్కించుకుని హాస్పిటల్‌కి తీసుకువెళ్ళాడు

యస్సై తిరిగి వచ్చేసరికి మూడుగంటలు దాటింది.

''నిజం చెప్పాడా?'' ఒక అరుపు అరిచాడు.

''చెప్పటంలేదండి.''

''నా ముందుకు తీసుకురా''

''ఆమెకు నడుముదగ్గర్నుంచి పాదాలవరకూ, చేతులూ కాలాయి. ముఖం నిండా బొబ్బలు. కళ్ళు మాత్రం పేలిపోలేదు నెలపైన పట్టవచ్చు మానటానికి.

నీ సంగతి చెప్పు. ఏదో ఒక కారణంచేత భార్యలను కాల్చిన కేసులే ఎక్కువ వస్తున్నాయి. నీవు ఉన్నసంగతి చెప్పు? నీ భార్యను డబ్బు తెమ్మంటే తేలేదా? మీ అత్తవారు నీవడిగినప్పుడల్లా డబ్బు ఇవ్వటంలేదా? ఎందుకు కాల్చావు భార్యను? పైగా తలుపు గొళ్ళెం పెడతావా బయట?'' చేతికర్ర ఎత్తాడు.

"ఇన్‌స్పెక్టర్‌గారూ! మొదట నేను చెప్పేది వినండి. నేను ఈ ఊరు పరీక్ష రాయటానికి వచ్చిన విద్యార్థిని నెలరోజుల కిందట ఇక్కడికివచ్చి విశ్వేశ్వరరావు వీధిలో పదిహేనోనెంబరు ఇంట్లో మేడమీద గదిని అద్దెకు తీసుకున్నాను. రేపు తొమ్మిదిగంటలకు పరీక్ష. రాత్రిళ్ళు పన్నెండుగంటలవరకూ చదువుతానండి. పదకొండుగంటలకు కేకలు వినిపిస్తే మేడదిగి, టార్చి తీసుకువచ్చి చూసి, తలుపు గొళ్ళెం తీశానండి. ఒళ్లు కాలిందని ముందు ఇక్కడికి తీసుకువచ్చానండి. ఇంతకుతప్ప ఆమె ఎవరో ఏంచేస్తుందో నాకు తెలియదండి.

''నీవున్నగదీ, ఆమెగదీ చూసివస్తాను. చుట్టుపక్కల విచారించాలి గదా? నీ విక్కడే ఉండు"

''నేనూ వచ్చి స్వయంగా నా హాల్‌టికెట్, నా పుస్తకాలూ చూపిస్తానండి ఇంటివాళ్ళను కూడా పిలిచి అడగండి. నేనున్నగదికి రెండిళ్లవతల ఆమెఉండే గది ఉంది ఈపాటికి కాలిపోయే ఉంటుంది- సర్. నేనువచ్చి అంతా చూపిస్తాను" కాళ్లమీద పడ్డాడు.

జీపు బయలుదేరి అతడు చెప్పిన ఇంటిముందాపి ఇన్‌స్పెక్టర్ ఆపైకి వెళ్ళాడు. విద్యార్థి తలుపు తాళంతీసి తన హాల్‌టికెట్ చూపించి ''ఇంజనీరింగ్ ఎంట్రెన్సు తెల్లవారి తొమ్మిది గంటలకు బస్టాండు అవతల ఉన్న సెంటర్‌కి వెళ్ళి రాయాల''ని చేతులు జోడించాడు.

పోలీసుజీపు రావటం చూసి చుట్టుపక్కల జనం ఇంటిచుట్టూ మూగారు. ఇంటి యజమాని మేడమీదికి వచ్చాడు.

"ఏమిట్రా రాఘవా? ఇన్‌స్పెక్టరుగారు వచ్చారెందుకు ?"

రాఘవ కన్నీళ్ళు తుడుచుకుంటూ జరిగినదంతా చెప్పాడు.

''ఇతడు నా స్నేహితుడి కొడుకు. పరీక్షలయ్యేవరకూ నేను ఇతడిని బైటికి పోవద్దని గట్టిగా చెప్పాను. పోనివ్వటంలేదు. నా స్నేహితుడి ఆశలన్నీ

ఇతడిమీది ఉన్నాయి. కుటుంబాదాయం తక్కువ. అయినా వీడిని ఇంజనీయర్ని చేయాలన్న పట్టుదలతో పంపాడు.

"ఆ అమ్మాయిని మీరెరుగుదురా ?"

''తెలుసు. భర్తకు ట్రాన్స్ఫరయింది. ఆయనకు బ్యాంకిలో ఉద్యోగం. ఈ అమ్మాయి టీచరు. తనకూడా బదిలీ కావాలని దరఖాస్తు పెట్టుకుంది, మా ఇంటికి వస్తూఉంటుంది. మంచి పిల్ల. ఎట్లా కాలిందో? బయటివాళ్ళు కాకపోతే గొళ్ళెంపెట్టటం ఏమిటి? ఆశ్చర్యంగా ఉంది. ఆ గదికి కిటికీ లేదు. ఎత్తుగా ఒక వెంటిలేటరు లాంటిది ఉంది. ఆ మార్గంద్వారా జరిగిఉండాలి. ఆయన ఒక ఉన్నతోద్యోగి. ఆయనకు అబద్ధం చెప్పవలసిన అవసరం కనబడలేదు ఇన్స్పెక్టర్కి.

ఆ చుట్టుపక్కలంతా విచారించాడు. అంతా ఆమాటే అన్నారు.

"ఇన్స్పెక్టర్, నేను హామీ ఇస్తున్నాను. ఈ అబ్బాయిని పరీక్ష రాయనివ్వండి. ఈ అవకాశం పోతే మళ్ళీ సంవత్సరానికిగాని వీలుకాదు. కేసు రిజిష్టరు చేసుకోండి గాని ఇతడిని ఇరికించవద్దు."

రాఘవ కూడా ఇన్స్పెక్టర్ చేతులు పట్టుకుని బ్రతిమాలాడు.

ఇన్స్పెక్టర్ వెళ్ళిపోయాడు.

హాస్పిటల్లో మాలినిని డాక్టరడిగాడు ఎలా జరిగిందని. నర్సులడిగారు.

ఎలా జరిగిందో ఆమెకు ఎంత ఆలోచించినా తెలియటంలేదు.

ఇన్స్పెక్టరు ఆమె పనిచేసే స్కూలుకు వెళ్ళాడు. టీచర్లనందరినీ ఆమెను గురించి అడిగాడు. అందరు తమకు స్కూల్లోనే పరిచయం గాని ఆమె ఇంటివిషయాలు తెలియవన్నారు.

రెండునెలలలో రిటైరు కాబోతున్న కనకమ్మ "నన్ను ఆ అమ్మాయి నొకసారి చూడనివ్వండి." అని, యస్సైని బ్రతిమిలాడి తను ఇంకా కొన్ని సంగతులు చెప్తానన్నట్టు సూచించింది.

జీపులో హాస్పిటల్కి వెళ్ళారు. మాలినికి కాలినచోట మందురాసి దుప్పటి కప్పారు. పక్కకు తిరిగి పడుకుని కన్నీరు కారుస్తోంది.

"మాలినీ నేనమ్మా కనకమ్మను. నీ సంగతి విని చూడాలని వచ్చాను. ఎట్లా ఉందమ్మా?"

"ఇదంతా నయమయితే నా ముఖం ఘోరంగా ఉంటుంది, నన్ను చూసి అందరూ అసహ్యించుకోరా ఆంటీ?"

"ముందు నయం కానీ. తరువాత సంగతి ఆలోచించటానికి డాక్టర్లు లేరా? అందుకు ఉపాయాలు లేవా? అన్నీ బాగా జరిగిపోతాయి. నేను డాక్టరుగారితో మాట్లాడతానులే నీవు ధైర్యంగా ఉండి డాక్టర్లు చెప్పినట్లు విని ఆరోగ్యం బాగుచేసుకో.

ఇన్‌స్పెక్టరుతో ఆమె కారిడర్‌లో నడుస్తూ "ఇదంతా మా స్కూలు మేనే జింగ్ కమిటీ చైర్మెన్ వల్ల జరిగిందని నాఅనుమానం. అతడు టీచర్లకు ఇంక్రిమెంట్లు ఆపుచేస్తాడు. ఒకటికి నాలుగుసార్లు టీచర్లు ఆయనకు అప్పీలు చేసుకొన్నకొద్దీ "ఇంటికొచ్చి కలుసుకో. "ఆ హోటల్లో కలుసుకో" అంటాడు. ఈ విధంగా అమా యకులైన టీచర్లు ఎందరో తమ శీలాన్ని కోల్పోయారు. ఇది ప్రైవేటు స్కూలు కాని ప్రభుత్వం స్వాధీనంచేసుకుంది. అయినా పాత మేనేజింగ్ కమిటీ పెత్తనం పోలేదు. ఉద్యోగానికి ఆశపడి వచ్చిన టీచర్లు ఈ శిక్షను అనుభవించాల్సిందే. ఈ మాలిని తండ్రి సబ్‌కోర్టు జడ్జి. ఆయనద్వారా విద్యాశాఖకు ఈవిషయాలు కొన్ని తెలిశాయి. విద్యాశాఖవారు తమసహాయాన్ని నిలిపివేస్తామని బెదిరించారు. అందుకు మాలినికీశిక్ష పడ్డది" ఆ పథకమంతా స్కూలు నౌకరు ద్వారా సేకరించిన కనకమ్మ గబగబా చెప్పింది.

"ప్రైవేటు స్కూళ్ళల్లో ఇటువంటి దారుణాలు చాలా జరుగుతున్నాయి. మీరు పెద్దవారు. ఆ అమ్మాయి క్షేమం కనుక్కుంటూ ఉండండి. భర్తకీ సమా చారం అందచేయండి. అమెకు ప్లాస్టిక్‌సర్జరీ డాక్టరునడిగి మెల్లగా చేయించండి" అంటూ అమెను స్కూల్లో దింపి వెళ్ళిపోయాడు యస్సై.

కనకమ్మ ఉత్తరమందుకున్న మాలిని భర్త గిరిరావు దాన్ని ఎవరూ చూడ కుండా ముక్కలుముక్కలు చేశాడు తను వేసుకున్న ప్లాన్ పాడయిపోగా ఎదురుతిరిగింది. ట్రాన్సఫరు కాకుండా మాలిని అక్కడే ఉంటే - తన కుటుం బంతో హాయిగా ఇక్కడ ఉందామనుకున్నాడు. కాని జరిగింది వేరు. అయినా

ఏదో భ్రమలో చేసుకున్నదా పెళ్ళి. జీవితమంతా పట్టుకుని వేలాడుతానంటే వీలవుతుందా? వదిలించుకుందామంటే కథ అడ్డం తిరిగింది.

అతడు ఆలోచిస్తూ సిగరెట్ ముట్టించి వీధి వరండాలో అటూ-ఇటూ తిరగటం మొదలుపెట్టాడు. మరొక ఉపాయమేదయినా ఉందా దీనిలోనుంచి బయటపడటానికని.

మాలిని భర్త తనను చూడటానికి వస్తాడేమో? ఈముఖ మెట్లా చూపించటమని దిగులుపడుతూ పక్కమీద దొర్లుతోంది.